సాక్షి 24/7 తూర్పుగోదావరి
మంగళవారం 22-5-2018
EAST GODAVARI
గరిష్ఠం 35.7 / కనిష్ఠం 28.7

# ఉద్యోగం గ్యారంటీ..!




- ప్లేస్‌మెంట్‌కు కేరాఫ్ ఎంఎస్ఐటీ
- కోర్సుపై పెరుగుతున్న ఆదరణ
- జేఎన్‌టీయూకేలో నేటి నుంచి కోర్సు ప్రవేశ పరీక్షలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ):

ఐటీ బూమ్‌తో సంబంధం లేకుండా ప్రారంభించిన నాటి నుంచి నూటికి నూరు శాతం ప్లేస్‌మెంట్లు కల్పిస్తున్న కోర్సుగా మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎంఎస్ఐటీ) ప్రఖ్యాతి గడిస్తోంది. ఐఐటీ, ఎన్ఐటీల్లో అందించే ఎంటెక్ ప్రమాణాలకు ఏమాత్రం తీసిపోని రీతిలో ఈ కోర్సు కొనసాగుతోంది. సాఫ్ట్ స్కిల్స్‌పై దృష్టి కేంద్రీకరిస్తూ విదేశాల్లో అందించే ఎంఎస్‌కు దీటుగా ఈ కోర్సు ఎదుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా జేఎన్‌టీయూ హైదరాబాద్‌తో పాటు ఆంధ్రప్రదేశ్, అనంతపురం, కాకినాడ యూనివర్సిటీలు కన్సార్టియం ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ (సీఐహెచ్ఎల్)గా ఏర్పడి ఈ కోర్సును రూపొందించాయి. రెండు సంవత్సరాల ఈ కోర్సు నిర్వహణకు అమెరికాలోని కార్నెగీ మెల్లాన్ యూనివర్సిటీ కీలక పాత్ర పోషిస్తోంది. ప్రస్తుతం 2018-19 సంవత్సరానికి సంబంధించి ఈ కోర్సు ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది.

### సాఫ్ట్ స్కిల్స్‌కు ప్రాధాన్యం

ఎంఎస్ఐటీ కోర్సులో సాఫ్ట్ స్కిల్స్‌కు చాలా ప్రాధాన్యం ఉంటుంది. ప్రతి వారం గ్రూపు డిస్కషన్స్, ప్రెజెంటేషన్స్, రైటింగ్ అసైన్‌మెంట్లు ఉంటాయి. ఈ కామర్స్ స్పెషలైజేషన్‌లో మొబైల్ అప్లికేషన్స్‌తో పాటు డేటా ఎనలిటిక్స్ డొమైన్స్‌పై శిక్షణ ఇస్తున్నారు. వైవిధ్యమైన లెర్నింగ్ పద్ధతుల ద్వారా విశిష్టమైన ప్రోగ్రామ్‌గా ఈ కోర్సు గుర్తింపు తెచ్చుకుంది. దీంతో ఈ కోర్సు కార్పొరేట్ సంస్థలను ఆకర్షిస్తోంది.

| సంవత్సరం | విద్యార్థుల సంఖ్య | ఉద్యోగాలు సాధించినవారు |
|---|---|---|
| 2012-13 | 30 | 30 |
| 2013-14 | 28 | 28 |
| 2014-15 | 21 | 20 |
| 2015-16 | 27 | 27 |
| 2016-17 | 22 | 20 |

**సీట్ల సంఖ్య: 50**

- దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ: మే నెల 30
- గాట్ ప్రవేశ పరీక్ష: మే నెల 22 నుంచి ప్రారంభం
- గాట్ ఫలితాలు: జూన్ 2న, కౌన్సెలింగ్ జూన్ 13వ తేదీ నుంచి
- ఎంపికైన అభ్యర్థులకు ప్రిపరేటరీ కోర్సు: జూన్ 27వ తేదీ నుంచి, మెయిన్ కోర్సు ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రారంభం
- అర్హతలు: బీటెక్, బీఈ (అన్ని విభాగాలు)

**ఈ కోర్సు సంబంధించిన పూర్తి వివరాలకు 77998 34586కు సంప్రదించాలి**

### టీసీఎస్‌లో విజయం సాధించా..



బీటెక్‌లో ఈసీఈ ఇంజినీరింగ్ చదివాను.ఎంఎస్ఐటీ కోర్సు పూర్తిగా సాఫ్ట్‌వేర్ రంగానికి సంబంధించింది. ఈ కోర్సు ద్వితీయ సంవత్సర ప్రథమ నెలలోనే ప్రముఖ సంస్థ టీసీఎస్‌కు ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

– నవ్యతా రెడ్డి, ఎంఎస్ఐటీ విద్యార్థిని

### క్యాంపస్ ఇంటర్వ్యూలకు తగ్గ శిక్షణ



ఈ కోర్సు పూర్తిగా క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విజయం సాధించేలా రూపకల్పన చేశారు. సిలబస్‌లో 90 శాతం ప్రాక్టికల్స్‌కు, పది శాతం మాత్రమే థియరీకి కేటాయించారు. ఈ కోర్సును అభ్యసించిన వారికి నూటికి నూరు శాతం ఉపాధి ఉంటుంది. ఫ్యాకల్టీలు ప్రతిఒక్కరూ వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని రోజూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. క్యాంపస్‌లో విజయం సాధించేలా మెళకువలు, జాగ్రత్తలు చెబుతున్నారు.

– ఎ.ప్రశాంత్, ఎంఎస్ఐటీ విద్యార్థి

### ప్రాక్టికల్స్ నాలెడ్జికి ప్రాధాన్యం



ఈ కోర్సు సిలబస్‌లో బీటెక్ తరహాలో పాఠ్యాంశాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా కేవలం ప్రాక్టికల్స్ నాలెడ్జికి ప్రాధాన్యం ఇస్తున్నాం. రోజుకు 11 గంటల్లో గంట మాత్రమే థియరీకి కేటాయించాం. మిగతా సమయంలో ప్రోగ్రామింగ్స్‌కు ప్రాధాన్యం ఇస్తున్నాం. దీంతో విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు సాధించగలుగుతున్నారు.

– డాక్టర్ సహదేవయ్య, ఎంఎస్ఐటీ కోర్సు కో–ఆర్డినేటర్

### లెర్నింగ్ విధానం మార్పుతో మంచి ఫలితాలు



ఎంఎస్ఐటీ కోర్సును ఆచరణ ద్వారా అభ్యసనం (లెర్నింగ్ బై డూయింగ్) పద్ధతిలో బోధించడం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయి. విద్యార్థులకు సబ్జెక్టుపై మంచి పట్టు వస్తుంది. వివిధ సంస్థలతో ఇంటర్న్‌షిప్ ద్వారా పరిశ్రమలు అనుసంధానమై విద్యార్థులు అనుభవం పొందుతున్నారు. దీంతో వారి నైపుణ్యాలు పెరుగుతున్నాయి.

– ఎ.వీరభద్రయ్య, కోర్సు ప్రిన్సిపాల్